ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
ఆదివారం 12 జనవరి 2025


నరసరావుపేట మండలం పాలపాడు ప్రాంతంలో సాగు చేసిన పొగాకు

పొగాకు.. 314 శాతం

- రబీలో రికార్డు స్థాయిలో సాగు
- శనగ, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయం..
- అనుమతులు పొందని కొందరు రైతులు

పొగాకు.. రబీలో రికార్డు స్థాయిలో సాగైంది. శనగ, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు అత్యధికంగా సాగు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అత్యధికంగా రైతులు పొగాకు సాగు వైపు మొగ్గారు. కొందరు రైతులైతే ఈసారి పొగాకు బోర్డు అనుమతి లేకుండానే సాగు చేశారు. అయినా ఈ సారి సాగు ఆశాజనకంగా ఉంది. దిగుబడులు కూడా బాగుంటాయని రైతులు ఆశిస్తున్నారు. విస్తృతంగా పొగాకు సాగు కావడంతో విక్రయాలకు పొగాకు బోర్డు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు వ్యవసాయ శాఖ సహకరించాలి. మొక్కజొన్న, శనగ సాగు సగానికి సగం తగ్గినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించిన నేపథ్యంలో పొగాకు సాగు గణనీయంగా పెరిగింది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రబీలో పంటల సాగులో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. మూడు జిల్లాల పరిధిలో రబీలో శనగ, మొక్కజొన్న పంటల సాగు గణనీయంగా తగ్గింది. ప్రత్యామ్నాయ పంటలపై అత్యధికంగా రైతులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో పొగాకు సాగు ఊహించని రీతిలో పెరిగింది. దీంతో రికార్డు స్థాయిలో పొగాకు సాగు చేశారు. సాగు విస్తీర్ణం 314 శాతంగా నమోదైంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 81,718 ఎకరాల్లో పొగాకు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. గత ఏడాది కన్నా సాగు రెట్టింపు చేశారు. వ్యవసాయ శాఖ అంచనా మేరకు పొగాకు సాధారణ విస్తీర్ణం 25,978 ఎకరాలు కాగా 81,718 ఎకరాల్లో సాగు చేశారు. పొగాకు దిగుబడులు రైతుల చేతికి వస్తున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. బోర్డు నుంచి ముందస్తు అనుమతులు పొంది పొగాకు సాగు చేయాలి. అయితే కొందరు రైతులు పొగాకు బోర్డు నుంచి అనుమతులు పొందకుండానే సాగు చేపట్టినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో బోర్డు నిర్ణయంపైనే పొగాకు విక్రయాలు ఆధారపడి ఉన్నాయి. సాగు చేపట్టిన అందరికీ పొగాకు విక్రయాలకు అనుమతులు మంజూరు చేయించేందుకు వ్యవసాయ శాఖ వెనువెంటనే చర్యలు చేపట్టకుంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. తాము సాగు చేసిన పొగాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకునేలా వ్యవసాయ శాఖ స్పందించాలని రైతులు కోరుతున్నారు.

సగం తగ్గిన శనగ, మొక్కజొన్న సాగు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రబీలో మొక్కజొన్న, శనగ సాగు గణనీయంగా తగ్గింది. సాధారణ విస్తీర్ణం కన్నా శనగ 40 శాతం సాగు తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,24,295 ఎకరాలు కాగా 66,675 ఎకరాల్లో శనగ సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 1,46,462 ఎకరాలు కాగా 85,095 ఎకరాల్లో మాత్రమే సాగైంది.

పొగాకు సాగు ఇలా(ఎకరాల్లో)..

జిల్లా	సాధారణ విస్తీర్ణం	సాగు	శాతం
పల్నాడు	6348	15,803	248.94
బాపట్ల	17,320	57,490	331.92
గుంటూరు	2,310	8,423	364.63



కొనుగోళ్లలో.. కుంభకోణం

- పేదల పేరిట దోపిడీపై కూటమి ప్రభుత్వం దృష్టి
- విజిలెన్స్ విచారణపై అక్రమార్కుల గుండెల్లో వణుకు
- పక్కాగా విచారిస్తే భారీ స్కాం వెలుగులోకి వచ్చే అవకాశం
- నాడు వైసీపీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే భూముల కొనుగోళ్లు
- సర్వే నెంబర్ల లీక్‌తో భూములను కొని ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయం

నవరత్నాల పేరుతో అధికారం చేపట్టి.. పేదలందరికీ స్థలాలు, ఇళ్లు అని భారీ భూ కుంభకోణానికి నాటి వైసీపీ పాలకులు పాల్పడ్డారు. పేదల ఇళ్ల కోసం అంటూ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యాప్తంగా నాడు సేకరించిన భూముల్లో రూ.కోట్లు కొల్లగొట్టారు. అతి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేయడం.. వాటినే అత్యధిక ధరకు ప్రభుత్వానికి అంటగట్టారు. ఈ కొనుగోళ్ల వ్యవహారంలో భారీ కుంభకోణాలు ఉన్నాయని నాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు ఆందోళనలు చేశాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఆ కొనుగోళ్ల కుంభకోణాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో నాటి భూ మాయలో భాగస్వాములుగా ఉన్న వైసీపీ నేతలు, అధికారుల గుండెల్లో వణుకు మొదలైంది. విజిలెన్స్ విచారణ పక్కాగా జరిగితే మూడు జిల్లాల పరిధిలో భారీ భూ స్కాంలు వెలుగుచూస్తాయని ప్రజలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

(గుంటూరు, బాపట్ల-ఆంధ్ర జ్యోతి)

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే జగనన్న కాలనీల పేరుతో భూసేకరణ జరిగింది. భూసేకరణ ఎక్కడైనా రెవెన్యూ శాఖ కనుసన్నల్లో జరుగుతుంది. కానీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో మాత్రం అంతా అప్పటి ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల పర్యవేక్షణలోనే జరిగింది. భూముల ధరలను ఆసాంతం పెంచేసి ప్రభుత్వానికి వాటిని స్వాధీనం చేసి కొద్ది రోజుల్లోనే రూ.కోట్లకు పడగలెత్తారు. పేదలందరికీ ఇళ్లు అని చెబుతూ వైసీపీ నేతలు కొనుగోళ్ల కుంభకోణానికి తెర లేపారు. భూసేకరణలో పెద్ద ఎత్తున ధర పెంచి వాటిని

తెనాలి నుంచి బీజం

భూసేకరణలో లోగడ కుంభకోణాలు జరిగిన దాఖలాలు లేవు. అలాంటిది ఇందులోనూ అవినీతికి పాల్పడొచ్చని వైసీపీ నేతలు చేసి చూపించారు. తొలుత తెనాలి నుంచి ఈ కుంభకోణానికి బీజం పడింది. సర్వే నంబర్లను ముందుగానే తహసీల్దార్ల ద్వారా తెలుసుకుని ఆ భూములను ఎమ్మెల్యేలు వారి అనుచరుల ద్వారా కొనుగోలు చేశారు. ఆయా సర్వే నెంబర్లలో అప్పటి వరకు ఎకరం రూ.10 లక్షలుంటే ఒక్కసారిగా రెండు, మూడు రెట్లు పెంచి రిజిస్ట్రేషన్లు జరిపించారు. దాంతో వాటిల్లో సగటు భూమి రిజిస్ట్రేషన్ విలువ పెరిగింది. దానిని ప్రభుత్వానికి ఇవ్వడం ద్వారా అర్బన్‌లో అయితే ఒకటి, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 1.25 విలువని అదనంగా గుణకారం చేసి ఆ మొత్తాన్ని నష్టపరిహారంగా నాటి నేతలు జేబుల్లో వేసుకున్నారు.

జగనన్న కాలనీలకు భూసేకరణలో అక్రమాలు

కొనుగోలు చేసే ఇన్‌సైడర్ ట్రేడింగ్ ప్రక్రియ గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున సాగింది. ఈ అక్రమాలకు వైసీపీ కీలక నేతల సహకారంతో పాటు కొంతమంది అధికారుల సహకారం కూడా ఉండడంతో రాజమార్గంలో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి రూ.కోట్లు కొల్లగొట్టేశారు. ముంపుప్రాంతాలు, శ్మశానాల సమీపంలో, ఊరికి చివరన జనసంచారం లేని చోట భూములను సేకరించి వాటిని జగనన్న లేఅవుట్లుగా మార్చారు. కొందరు ఎమ్మెల్యేలు అయితే భూ యజమానులతో ముందుగానే ఒప్పందాలు చేసుకున్నారు. మీ భూమికి మంచి ధర ఇప్పిస్తామని, అందుకు గాను తమకు 5 శాతం కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని మాట్లాడుకుని భూసేకరణ కింద భూములు ఇప్పించారు. అప్పట్లో తెనాలి మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద బాబు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఈ భూదోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు జరిపారు. అయితే వారి గళం అరణ్యరోదనైంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ భూ కుంభకోణంపై విచారణ జరిపితే వైసీపీ నేతల జేబుల్లోకి పోయిన ప్రజాధనం

(మిగతా 6వ పేజీలో)


చిన్నపాటి వర్షానికే బాపట్ల పరిధిలోని ప్యాడిసన్‌పేట జననన్న కాలనీ దుస్థితి(ఫైల్ ఫొటో)

400 ఎకరాలు.. రూ.1300 కోట్లు

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 400 ఎకరాలకు పైగానే భూసేకరణ చేసి రూ.1300 కోట్ల పైచిలుకు ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజాన నుంచి చెల్లించారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే పేదల ఇళ్లకు అడ్డుపడతారా అని ఎదురుదాడికి దిగేవారు. అప్పట్లో భూసేకరణని పర్యవేక్షించిన రెవెన్యూ అధికారులు కూడా పండిపోయారు. ఊహించనంత ధర వస్తుండటంతో సంప్రదింపుల ద్వారానే భూసేకరణ ప్రక్రియ పూర్తి అయింది. జిల్లా స్థాయి అధికారి ఒకరైతే సూట్‌కేసులకు సూట్‌కేసుల నగదుని తీసుకెళ్లారని అప్పట్లో వైసీపీ నేతలే గుసగుసలాడారు.



ముందస్తుగానే.. పండుగ

- రాజధాని రైతులకు కౌలు విడుదల
- అమరావతి రైతుల్లో ఆనందోత్సాహాలు
- సీఆర్డీఏకు రాష్ట్ర ప్రభుత్వం రూ.255 కోట్లు విడుదల
- కౌలుకు రూ.229.7 కోట్లు.. పింఛన్లకు రూ.25.96 కోట్లు
- ఎట్టకేలకు అసైన్డ్ రైతుల మూడేళ్ల బకాయిలకూ మోక్షం



గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరం సమీపిస్తోంది. పండుగను ఆనందోత్సాహాల మధ్య కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో స్వగ్రామాల్లో జరుపుకునేందుకు దూరప్రాంతాల నుంచి తరలివస్తోన్నారు. అయితే నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల ఇళ్లలో ముందస్తుగానే పండుగ సంబరం నెలకొంది. రాజధాని రైతులకు రావాల్సిన కౌలు బకాయిలు, పేదలకు అందాల్సిన పింఛన్లు అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏపీసీఆర్డీఏ ప్రతిపాదనల మేరకు 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగో క్వార్టర్ నిధుల కింద రూ.255 కోట్ల నిధులను రెండు రోజుల క్రితం విడుదల చేసింది. గతంలో కౌలు, పింఛన్ల కోసం ఎదురుచూపులతో సరిపెట్టాల్సి వచ్చేదని కూటమి ప్రభుత్వంలో ఆ బాధ తప్పిందని ఇప్పటికి రెండు విడతల కౌలు అందిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పదో ఏడాది కౌలుకు మోక్షం

సీఆర్డీఏ ఒప్పందం ప్రకారం రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ప్రతి ఏటా వార్షిక కౌలు చెల్లించాలి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కౌలు ఎగవేస్తూ వారిని ఐదేళ్లుగా ఇబ్బందులపాలు చేసింది. న్యాయస్థానాల ద్వారా పోరాడి రైతులు మూడేళ్లపాటు కౌలు సాధించుకున్నారు. హైకోర్టు తీర్పును సైతం ధిక్కరిస్తూ చివరి రెండేళ్ల కౌలును వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. దీంతో వారికి 9, 10 సంవత్సరాలకు చెందిన వార్షిక కౌలు అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు చెల్లింపులకు చర్యలు తీసుకుంది. కిందటేడాది ఆగస్టులో వారికి తొమ్మిదో ఏడాది వార్షిక కౌలు బకాయిలు చెల్లించింది. రైతులకు అందాల్సిన రూ.220 కోట్ల బకాయిలు చెల్లించింది. కాగా పదో ఏడాది వార్షిక కౌలు పెండింగులో ఉండగా దానికి సంబంధించి రైతుల నుంచి సీఆర్డీఏకు భారీగా విజ్ఞప్తులు వెళ్లాయి. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కూడా రైతులు మంత్రులు లోకేశ్, నారాయణలను కలిసి తమ గోడు వినిపించుకున్నారు. దీంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. పండుగపూట వారికి తీపి కబురు అందించింది. రాజధాని రైతుల కౌలు చెల్లింపులకు కావాల్సిన నిధులు విడుదల చేస్తూ బుధవారం రాత్రి జీవో జారీ చేసింది. ఏపీ సీఆర్డీఏకు రూ. 229.71 కోట్లు విడుదల చేసింది.

అసైన్డ్ రైతులకూ పండుగే...

రాజధానికి భూములిచ్చిన అసైన్డ్ రైతులను గత వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా వేధించింది. వారి భూములపై సీఐడీ విచారణకు ఆదేసించి, వాటిని నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి మూడేళ్లుగా వారికి రావాల్సిన కౌలు ఆపేసింది. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురై, అప్పులపాలయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 3,120 మంది రైతులను దశలవారీగా సీఐడీ కేసుల నుంచి విముక్తి చేసి, వారికి కౌలు చెల్లించేందుకు పూనుకుంది. ఇప్పటికే వారికి సంబంధించిన కౌలు ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు వెళ్లినా నిధులు లేకపోవడంతో అది పెండింగులో పడింది. తాజాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వారికి కౌలు కష్టాలు తీరనున్నాయి. మూడేళ్ల కౌలు వారికి అందిస్తామని సీఆర్డీఏ అధికారులు చెబుతున్నారని అసైన్డ్ రైతులు చెబుతున్నారు.

పింఛన్లకూ ఢోకా లేదు

రాజధాని పరిధిలోని భూమి లేని నిరుపేదలకు పింఛను అందజేస్తామని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి నెలా వారికి రూ.5 వేలు చొప్పున పింఛను అందించాల్సి ఉంది. ఆ పింఛన్లకు కూడా ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రభుత్వం నిధులు కేటాయించింది. రూ.25.96 కోట్లు సామాజిక భద్రతా నిధి కింద విడుదల చేసింది. దీంతో రాజధాని రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

167ఏ అలైన్‌మెంట్ మార్చండి సార్

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతుల వినతి
- ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో సీఎంను కలిసిన రైతులు


ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, 167ఏ హైవే బాధిత రైతులు

నరసరావుపేట టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు అడ్డరోడ్డు-చీరాల ఓడరేవు 167ఏ హైవే అలైన్‌మెంట్ మార్చాలని ముఖ్య మంత్రి చంద్రబాబును బాధిత రైతులు కోరారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో శనివారం వెలగపూడిలో ముఖ్యమంత్రిని కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సపాలెం, గుంటగార్లపాడు, రావిపాడు రైతులు కలిశారు. ఈ సందర్భంగా 167ఏ హైవే నరసరావుపేట సమీపం నుంచి పోతుందని ఈ కారణంగా ఒకే సామాజిక వర్గం, ఒకే పార్టీ వారే అధికంగా నష్టపోతున్నారని రైతులు ముఖ్యమంత్రికి వివరించారు. నరసరావుపేట మున్సిపల్ పరిధిని ఇప్పటికే ఇస్సపాలెం, రావిపాడు వరకు విస్తరించారని, అందువల్ల 167ఏ హైవేను ఇప్పుడున్న అలైన్‌మెంట్ ప్రకారం వేస్తే రెండు మూడేళ్ల తర్వాత ఉపయోగం ఉండదన్నారు. రోడ్డు మున్సిపాలిటీలో కలిసి పోతుందన్నారు. అధికారులతో చర్చిస్తామని ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని రైతులు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్, నల్లపాటి సత్యనారాయణ, కేసానుపల్లి పీటర్‌రాజు, బండ్లమూరి శేఖర్, ఆళ్ళ శ్రీనివాసరావు, కట్టా సాంబశివరావు, కట్టా శ్రీను, నల్లపాటి జగన్‌మోహన్‌రావు, జగదీశ్, ఉప్పుటూరి అప్పయ్య, నల్లపాటి రామయ్య, కొరిటాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్


ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. నంబూరు గ్రామం జాతీయ రహదారి పక్కన 'దీనీ ఇజ్‌తిమా' ప్రార్థన మందిరంలో గుంటూరు, కృష్ణా, ఏలూరు జిల్లాల ముస్లింల ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ముస్లింల ప్రార్థన కార్యక్రమానికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇలాంటి పవిత్ర ప్రార్థనలు మా నియోజకవర్గంలో జరగటం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మూడు జిల్లాల ముస్లిం మత పెద్దలు, టీడీపీ ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడి ఆత్మహత్య

బాపట్లరూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఉరివేసుకొని మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన గవిని వెంకటసాయి కిరణ్ (24) కుటుంబ కలహాల నేపథ్యంలో ముత్తాయపాలెం గ్రామశివారులో ఉన్న పశువుల పాకలో ఉరివేసుకొని మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు తెలపటంతో సంఘటనా స్థలానికి చేరుకొని సాయికిరణ్ మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బాపట్ల రూరల్ పోలీసులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 565.20 అడుగులు ఉంది. ఇది 244.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7768 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,852 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 54,120 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 54,120 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఆలపాటికి ఘన విజయం తేవాలి

● ఆత్మీయ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్


మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, పక్కన ఆలపాటి, నక్కా ఆనంద్ బాబు

తెనాలి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి శ్రేణులంతా ఒకే తాటిపై నడుస్తూ ఆలపాటిని ఎమ్మెల్సీగా ఘన విజయంతో గెలిపించుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం పట్టణంలోని రత్నపార్చ్యున్ కల్యాణ మండపంలో తెనాలి- వేమూరు నియోజకవర్గ పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్ రామకృష్ణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఏ విధంగా దిగజార్చాడో అందరం చూశామన్నారు. అమరావతి రాజధానిని నిర్వీర్యం చేయడంతోపాటు రోడ్లు, రైతులను సైతం ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అప్పటి ప్రభుత్వ విధానాలపై ప్రజల తరుపున మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేసిన పోరాటం అభినందనీయమన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ వైసీపీ అధికార మదంతో చేసిన అన్ని ప్రయత్నాలపై మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తన ధైర్యశైలితో పోరాడారన్నారు. ఆయన తొలిగా తెలుగు యువత నాయకుడిగా తదుపరి ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన ఎంతో అనుభవం ఉందన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవ నాయుడు మాట్లాడుతూ మంచి నాయకత్వానికి పట్టభద్రులందరూ ఓటు వేయాలన్నారు. ఉద్యోగుల ప్రతి సమస్యను ధైర్యంగా చెప్పే ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వంటి మంచి నాయకుడికి ఎమ్మెల్సీ సీటు ఇవ్వడంపై ఆనందంగా ఉందన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనపై కూటమి ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాననీ, ప్రజలందరికీ మంచి జరిగేలా తన కార్యాచరణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తన విజయాన్ని కాంక్షిస్తూ అభిమానాన్ని చాటుతున్నారని వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారి ప్రసంగంలో ఆలపాటి గెలుపు ఆవశ్యకతను వివరించారు. తొలుత టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు సభా పరిచయం చేయగా రావిచిన్ని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో రెండు నియోజకవర్గాల గ్యాడ్యుయేట్ ఓటర్లు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

రంగారావు సేవా ప్రస్థాన స్వర్ణోత్సవాలు ప్రారంభం


డాక్టర్ రంగారావును సత్కరిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు

చిలకలూరిపేట, జనవరి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సేవా సంస్థ అసిస్ట్ ఆవరణలో శనివారం అసిస్ట్ సంస్థ ఆపరేషనల్ డైరెక్టర్ డాక్టర్ జాష్టి రంగారావు సేవా ప్రస్థాన స్వర్ణోత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకలలో భాగంగా తొలి రోజున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 9 జిల్లాల పరిధిలో ఉన్న వెయ్యి గ్రామాల్లో అసిస్ట్ సంస్థ అత్యుత్తమ రీతిలో సేవలను అందిస్తుందని చెప్పారు. శాసన సభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, ప్రత్తిపాటి పుల్లారావు, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఏలూరి సాంబశివరావు, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు పాల్గొని మంత్రి స్వామితో కలిసి డాక్టర్ జాష్టి రంగారావును ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ అసిస్ట్ సంస్థ ద్వారా గ్రామీణ ప్రజానీకానికి రంగారావు చేస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని అన్నారు. రంగారావుకు ఇటీవల సౌత్ వెస్ట్రన్ అమెరికన్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయటం అందరికీ గర్వకారణమని అన్నారు. అసిస్ట్ సంస్థ అధ్యక్షుడు వడ్లమాని రవి, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి పలు రోటరీ క్లబ్బులకు చెందిన ప్రతినిధులు, రోటరీ 3150 జిల్లా పూర్వ అధ్యక్షుడు ఏ.రత్న ప్రభాకర్, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, వడ్లమాని రాజ్యలక్ష్మి, ఎస్.రామప్రసాద్, శరత్ చౌదరి తదితరులు రంగారావుకు ఆత్మీయ సత్కారం చేశారు. అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ కృష్ణ హరీష్, విష్ణుప్రియ, డాక్టర్ కె.సాంబశివరావు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకొన్న ఎస్ఐ లోకేశ్వరావు


బాలుడు అభిచందును ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ లోకేశ్వరరావు

శావల్యాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్లి సంక్రాంతి పండగ జరుపుకొనేందుకు సొంతూరుకు తిరిగి వస్తున్న పేదకుటుంబం రోడ్డు ప్రమాదానికి గురవ్వగా విషయం తెలుసుకొన్న శావల్యాపురం ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తన పరిధి కాకపోయినా సంఘటనా స్థలానికి చేరుకొని హుటాహుటిన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకొన్నారు. ఈ సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలోని సంతమాగులూరు మండలం వెల్లలచెరువు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శనివారం జరిగింది. పెద్ద అర్ధవీడు మండలం పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన పెద్ద చెన్నకేశవులు, భార్య లక్ష్మీదేవి జీవనోపాధి నిమిత్తం విజయవాడలో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండగకు భార్యభర్తలు, ఐదేళ్ల కుమారుడు అభిచందుతో కలసి స్కూటీపై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో వెల్లలచెరువు వద్దకు రాగానే వినుకొండ నుంచి నర్సరావుపేటకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టింది. స్కూటీపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడి తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే గంటవారిపాలెం సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న శావల్యాపురం ఎస్ఐ లోకేశ్వరరావు విషయం తెలియగానే సంఘటనా స్థలానికి వెళ్లి 108కి సమాచారం అందించి క్షతగాత్రులను నర్సరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి సంతమాగులూరు పోలీసులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు భార్య లక్ష్మీదేవి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ఇద్దరు వైసీపీ కార్యకర్తలు అరెస్టు

మాచర్లటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణానికి చెందిన ఇద్దరు వైసీపీ కార్యకర్తలు దాసరి శివ, కేశవ్‌లను శనివారం మాచర్ల పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. 2022 డిసెంబరు 16న మాచర్ల పట్టణంలో టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహిస్తుండగా వైసీపీ నేతలు దాడులకు దిగారు. టీడీపీ నాయకుల గృహాలు, పార్టీ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. ఈ కేసులో దాసరి శివ ఏ43, కేశవ్ ఏ44గా ఉన్నారు. పట్టణ పోలీసులు శనివారం వీరిని అరెస్టు చేసి మాచర్ల పట్టణంలోని సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ప్రశాంత్ వీరికి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను పోలీసులు గురజాల సబ్‌జైల్‌కు తరలించారు.

గణపవరంలో రూ.20 లక్షల విలువైన సొత్తు చోరీ

నాదెండ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గణపవరంలోని తూబాటి శేషగిరిరావు(శేషు) ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.20 లక్షల విలువైన సొత్తును చోరీ చేశారు. శేషగిరిరావు కుమార్తె ఆస్ట్రేలియా నుంచి రావటంతో కుటుంబ సభ్యులు అందరూ ఈ నెల 10న ఇంటికి తాళం వేసి శ్రీశైలం వెళ్లారు. రాత్రి 9 గంటలకు తిరిగి ఇంటికి వచ్చిన వారు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. ఇంటి వెనుక ఉన్న వంట గది తలుపులను లోపలకు నెట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. కబోర్డులను పగలగొట్టి దానిలో ఉన్న బీరువా తాళాలను తీసుకొని బీరువాను తెరిచారు. కబోర్డుతోపాటు బీరువాలో ఉన్న సుమారు 30 సవర్ల బంగారు ఆభరణాలతోపాటు కొంత నగదును చోరీ చేశారు. సంఘటనా స్థలాన్ని శుక్రవారం రాత్రి ఎస్ఐ పుల్లారావు పరిశీలించారు. శనివారం తెల్లవారు జామున గ్రామానికి వచ్చిన క్లూస్ టీమ్ వేలి ముద్రల నమూనాలను సేకరించారు. శేషగిరిరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనుగోళ్లలో.. కుంభకోణం

(5వ పేజీ తరువాయి)

లెక్క తేలుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. భూసేకరణకు సంబంధించిన ఫైళ్లన్ని కలెక్టరేట్ రెవెన్యూ విభాగం వద్ద భద్రంగా ఉన్నాయి. విజిలెన్స్ కనుక ఆ ఫైళ్లను తీసుకుని విచారణ జరిపితే అక్రమాలు ఇట్టే వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నది. ఈ కుంభకోణంలో ఒక రిటైర్డు ఉన్నతాధికారి పాత్ర ప్రముఖంగా ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అలానే జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డీవోలు, తహసీల్దార్ల పాత్రలు కూడా బయటపడతాయి.

కాలనీలు.. కన్నీళ్లు

ఇళ్ల కోసం స్థలాలను పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చించి కొనేటప్పుడు అవి నివాసయోగ్యమా కాదా అనే అంశంతో పాటు లోతట్టు ప్రాంతమా, వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉందా అన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. కానీ నాటి భూసేకరణలో కేవలం ఎంత మొత్తంలో కొల్లగొట్టవచ్చు అన్న దానికే నేతలు పరిమితం కాగా వారికి అధికారులు పూర్తిగా సహకరించారు. దీంతో మూడు జిల్లాల పరిధిలోని అనేక ప్రాంతాల్లోని లేఅవుట్లలో స్థలాలు నివాసయోగ్యంగా లేవు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల కట్టుకునేందుకు వెనుకంజ వేయడంతో ప్రస్తుతం అవి అడవులను మరపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో భూములు కొనడంతో వాటిని మెరక చేయడానికి పెద్ద ఎత్తున మట్టి తోలి ఈ క్రాంటాక్టుల్లో కూడా పెద్దమొత్తంలో నేతలు లబ్ధి పొందారన్న ఆరోపణలున్నాయి.

అక్రమాల్లో మచ్చుకు కొన్ని..

● తాడికొండ నియోజకవర్గంలో వాగు, చెరువు పోరంబోకు భూములను కూడా భూసేకరణ చేయించి సొమ్ము చేసుకున్నారు.
● జొన్నలగడ్డలో ఎకరానికి రూ.80 లక్షలకు పైగా చెల్లించారు.
● తెనాలికి సమీపంలోని జంపనిలో ఎకరానికి రూ.55 లక్షలు చెల్లించారు.
● వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో ఎకరానికి రూ.52 లక్షలు చెల్లించారు.
● కొల్లూరులోని మొసలిపాడులో ఎకరానికి రూ.30 లక్షలు చెల్లించారు.
● పొన్నూరులోని దండమూడిలో రూ.50 లక్షలు ఇచ్చారు.
● వినుకొండలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పనికి రాని భూములనే ఎకరం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు చెల్లించి సేకరించారు.
● బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండల పరిధిలోని ఓ గ్రామంలో ఎకరం 25 లక్షల ధర ఉంటే ఇక్కడ జగనన్న కాలనీల భూసేకరణ పేరిట దాదాపు రూ.75 లక్షలు వెచ్చించారు.
● ఈస్ట్ బాపట్ల పరిధిలో 35 ఎకరాల అసైన్డ్ భూమని అప్పట్లో సేకరించారు. ఇందుకోసం ఇచ్చిన పరిహారం దాదాపు రూ.25 కోట్లుకాగా ఇందులో అధిక మొత్తం వైసీపీ నేతల జేబుల్లోకే పోయిందన్న ఆరోపణలు ఉన్నాయి.
● వేమూరు నియోజకవర్గ పరిధిలో కూడా పేదలకు ఇళ్ల స్థలాల పేరిట భారీ దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది.
● బాపట్ల జిల్లాలో 287 లే అవుట్లను వేయగా దాదాపు 55 లే అవుట్ల కోసం చేసిన భూసేకరణ అనుమానంగా ఉండడతో రెవెన్యూ యంత్రాంగం వాటిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది.

హైకోర్టులో ఉద్యోగం, రియల్ ఎస్టేట్ పేరుతో మోసం

● రూ. 59 లక్షలు వసూలు చేసిన నిందితుడు చుక్కా బాబు అరెస్టు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినోద్‌కుమార్

మంగళగిరి సిటీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్, ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయకులను నమ్మించి రూ.లక్షల్లో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని మంగళగిరి అర్బన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ డి.వినోద్‌కుమార్ శనివారం నిందితుడి వివరాలను వెల్లడించారు. గుంటూరు రాజీవ్‌నగర్‌కు చెందిన చుక్కా బాబు అలియాస్ లవ్ బాబు గత కొన్నేళ్లుగా మంగళగిరిలో నివసిస్తూ కారు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. బాబు, అతని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పథకం ప్రకారం ఖరీదైన కార్లను అద్దెకు తీసుకుని తిరుగుతుంటారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అమాయకులు కన్పిస్తే వారితో ఎంతో నమ్మకంగా పరిచయం ఏర్పరచుకుని, తమకు మంచి పలుకుబడి ఉందనీ, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.లక్షల్లో వసూలు చేసి ఆ డబ్బుతో జల్సాలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఏడాది క్రితం పొన్నూరుకు చెందిన దాసరి రామమోహనరావు అనే వ్యక్తిని బాబు, అతని స్నేహితులు వంశీకృష్ణ, తరుణ్‌లతోపాటు కుటుంబ సభ్యులు పరిచయం చేసుకున్నారు. రామమోహనరావు తమ్ముడికి హైకోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. అంతటితో ఆగకుండా హైకోర్టులో స్టెనోగా పనిచేసే అరుణ్ అనే వ్యక్తి మృతి చెందాడనీ, అతని పేరు మీద రాజధానిలో రెండెకరాల భూమి ఉందని నమ్మించారు. ఆ భూమి నలుగురు హైకోర్టు న్యాయమూర్తుల కస్టడీలో ఉందనీ, రూ.50 లక్షలు చెల్లిస్తే ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పి మొత్తం రూ.59 లక్షలను రామమోహనరావు వద్ద నుంచి తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన రామమోహనరావు మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడు చుక్కా బాబును విజయవాడలో అరెస్టు చేసి మంగళగిరి కోర్టుకు హాజరు పర్చగా, న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ఆరేళ్లుగా రోడ్డుకు అడ్డుగా ఉన్న గోడ తొలగింపు


పొనుగుపాడులో అడ్డుగా ఉన్న గోడను తొలగించి చదును చేస్తున్న జేసీబీ

ఫిరంగిపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగుపాడు గ్రామంలో గత ఆరేళ్లుగా రెండు వర్గాల మధ్య వైషమ్యాలకు కారణమైన దారి గోడను రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు ఎట్టకేలకు జేసీబీతో పడ గొట్టించారు. శనివారం రోడ్డుకు అడ్డంగా ఉన్న గోడను పడగొట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ గోడను గ్రామంలో వైసీపీ వర్గానికి చెందిన వారు నిర్మించారు. అప్పటి నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన వర్గం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కన్పించలేదు. గోడను నిర్మించిన స్థలం చర్చికి సంబంధించిందనీ, దీనికై ప్రహరీ గోడ నిర్మించామని వైసీపీ వర్గం చెబుతుండగా, గోడ కట్టిన స్థలం గ్రామ కంఠంలోనిదనీ, తమ పూర్వీకులు రాకపోకలకు దీనిని వినియోగించేవారనీ, అక్రమంగా గోడను నిర్మించి రహదారికి అడ్డు వేశారని తెలుగుదేశం పార్టీకి చెందిన వర్గం ఆరోపిస్తుంది. స్థానిక అధికారులు మాత్రం ఈ వివాద స్థలం గ్రామ కంఠంగా ఉందనీ, ప్రజల రాకపోకలకు అడ్డుగా ఉన్న గోడను పడ గొట్టామని తెలిపారు. గోడను పడగొట్టడంతో ఎలాంటి వివాదాలు జరగకుండా 180 మంది పోలీసు బలగాలతో ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

పులిచింతల నీటి సమాచారం

అచ్చంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 38.27 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు.

జోన్ డైరీ

● గురజాల మండలంలోని చర్లగుడిపాడులో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్ఫేర్ ఆర్గనైజర్ బీక్కి అలేఖ్య వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రధాన వీధుల్లో మొక్కలు నాటనున్నారు.

● 13వ తేది ఆరుద్రోత్సవం (శివ ముక్కోటి) పురస్కరించుకుని అమరావతిలోని అమరేశ్వరునికి అన్నాభిషేకం జరుగుతుందని ఈవో పీ. సునీల్‌కుమార్ తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని సునీల్‌కుమార్ కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అచ్చంపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన అచ్చంపేట ఎస్సీ కాలనీలో శనివారం జరుగుతున్న డ్రెయినేజ్ పనులను పంచాయతీ రాజ్ ఏఈ డీ శివయ్యతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకుడు వెనిగండ్ల కోటయ్య పరిశీలించారు. కాలనీలో రూ 2 లక్షల పంచాయతీ నిధులతోను, రూ 10 లక్షల మండల నిధులతో సీసీ రోడ్డుతో పాటు డ్రెయినేజ్ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పనులను కోటయ్య పరిశీలించారు.

సీజీజీబీ శాఖ ప్రారంభం

దుర్గి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గిలో నూతనంగా ఏర్పాటు చేసిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు (సీజీజీబీ) నూతన శాఖను శనివారం బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు నూతన శాఖను ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంసుభాష్, నరేంద్ర, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

పిడుగురాళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్‌ను శనివారం గురజాల డీఎస్పీ జగదీష్ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిపట్ల మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని పోలీసులకు సూచించారు. డీఎస్పీతోపాటు సీఐ వెంకట్రావు, ఎస్ఐలు మోహన్, శివనాగరాజు వున్నారు.

చందన అలంకారంలో
స్వామి వారి దర్శనం

సత్తెనపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసంలో భాగంగా పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి శనివారం చందనాలంకారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే పట్టణంలోని వడ్డవల్లిలో ఉన్న శ్రీరామాలయం వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఉత్సవ మూర్తులను పట్టణంలో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా భక్తులు కోలాట ప్రదర్శన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవ మూర్తులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

పిడుగురాళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3, 4 వార్డుల పరిధిలో కూటమి నేతల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు మహిళలు, యువత ముగ్గుల పోటీలలో ఆసక్తిగా పాల్గొన్నారు. విజేతలైన వారికి డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, దీపిక, పాండురంగ శ్రీను, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం అధ్యక్షుడు కాకుమాను మల్లికార్జునరావు, జనసేన నేతలు కటకం అంకారావు, దూదేకుల ఖాశింసైదా, కామిశెట్టి రమేష్, వడ్డవల్లి సాంబశివరావు, సయ్యద్ అమీర్‌అలీ, జొన్నలగడ్డ శ్రీను, చల్లగుండ్ల సీత, సింగంశెట్టి వెంకటరమణ, నూతి అరుందతి, జొన్నలగడ్డ లక్ష్మీ, కొంకా రాధ, కోకాటి శారద, డాక్టర్ వలి, మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపాల్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం కమిటీ అధ్యక్షుడిగా యేలూరి

పిడుగురాళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన యేలూరి చంద్రశేకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ పెద్దలు సమావేశంలో చంద్రశేఖరరావును కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకోగా, సెక్రటరీగా కొలిశెట్టి సుబ్బారావు, కోశాధికారిగా కొత్త లక్ష్మీనారాయణ, కల్యాణ మండపం అధ్యక్షుడిగా గుడివాడ కుటుంబరావు, సెక్రటరీగా వల్లంభొట్ల వెంకట నాగేశ్వరరావులు ఎంపికయ్యారు. వీరిని కనిగిరి శ్రీనివాసరావు, పాండురంగ శ్రీను, ఎస్ఆర్ఎంటి సుబ్బారావుతో పాటు పలు అసోసియేషన్‌ల నాయకులు, పలువురు నేతలు అభినందించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

దుర్గి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని ఓబులేశునపల్లె గ్రామంలో గల కోట సైదయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను కూటమి నేతలు శనివారం ప్రారంభించారు.

రైతుల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
● జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మినీ గోకులం షెడ్డుల ప్రారంభోత్సవాలు

క్రోసూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతన్నల సంక్షేమం ఆర్థికాభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం మండలంలోని అందుకూరులో మినీగోకులం షెడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ 2.30 లక్షల వ్యయంతో ఈ షెడ్డుని నిర్మించిగా ఆ ఖర్చులో 90 శాతాన్ని సబ్సిడీగా ప్రభుత్వమే భరిస్తుందని, కేవలం 10 శాతం మాత్రమే లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలంలో సుమారు రూ 33 లక్షల వ్యయంతో 14 గోకులం షెడ్లను నిర్మించి ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పథకాన్ని రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావు, అందుకూరు మాజీ సర్పంచ్ తాళ్ళూరి శ్రీనివాసరావు, దిగుమర్తి తిరుమలరావు, వాసిరెడ్డి వెంకటరావు, వేణు, చావా మురళీకృష్ణ, చావా నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, నలజాల కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, జనసేన నేతలు యర్రంశెట్టి రామకృష్ణ, ఎంపీడీవో జీ శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కారంపూడిలో షెడ్డును ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు


అందుకూరులో గోకులం షెడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

దుర్గి, (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలంలో ఆరు మినీ గోకులాలు షెడ్లను ఎంపీపీ యేచూరి సునీతాశంకర్ ప్రారంభించారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా దుర్గిలో 1, ఆత్మకూరులో 2, ధర్మవరంలో 2, అడిగొప్పులలో ఒక షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధులతో ఒక్కో షెడ్డుకు రూ. 2.30 లక్షలు మంజూరు చేసిందన్నారు. మండలంలో మొత్తం 25 మంజూరుకాగా ఆరు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ఏపీవో వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాదిలో రూ. 2.30 లక్షలతో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును టీడీపీ నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, గుజ్జుల పాపిరెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, సిచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, కూటమి నేతలు కారంపూడి,పెదకొదమగుండ్ల, వ్యాపకంపల్లి, చింతపల్లి గ్రామాల్లో నిర్మించిన గోకులం షెడ్లను ప్రారంభించారు. మండల పరిధిలో 25 గోకులం షెడ్లు మంజూరు కాగా 13 షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రహ్మం, టీడీపీ నేతలు బొల్నేడి శ్రీనివాసరావు, కటికల బాలకృష్ణ, మనుగోడు సత్యం, చప్పిడి రాము, గోరంట్ల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల, (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని ఆనందపేట, ఇతర ప్రాంతాల్లో నిర్మించిన నూతనంగా నిర్మించిన పలు గోకులాను టీడీపీ సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి ప్రారంభించారు. మండలానికి 25 గోకులాలు మంజూరు కాగా ఆరు పూర్తయ్యాయని ఏపీవో జయచంద్ర తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, డాక్టర్ బషీర్, మాజీ ఎంపీటీసీ వైరమేష్‌బాబు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కుమారి, గాదే శ్రీనివాసరావు, ఆచారి పాల్గొన్నారు.


పిడుగురాళ్లలో షెడ్డును ప్రారంభిస్తున్న గండికోట వెంకటేశ్వర్లు, సర్వేశ్వరరావు తదితరులు

పిడుగురాళ్ల (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంకి, పాతగణేశునిపాడు, బ్రాహ్మణపల్లి, తుమ్మలచెరువు, పెద అగ్రహారం, చినఅగ్రహారం, పందిటివారిపాలెం, జూలకల్లు, గుత్తికొండ గ్రామాల్లో నిర్మించిన మినీ గోకులం షెడ్లను నాగార్జునసాగర్ ప్రాజెక్టు డీసీ చైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు, జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఎంపీడీవో రామచంద్రరావు తదితరులు ప్రారంభించారు. తొమ్మిది గ్రామ పంచాయతీలలో 14 మినీగోకులం షెడ్లు పూర్తయ్యాయని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యడ్లపల్లినారాయణ, నందిపాటి శ్రీనివాసరెడ్డి, పాదర్తి రాజేశ్వరి, శివ, ఏపీవో మేరి గ్రేస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

● సబ్ డివిజన్ పోలీసు అధికారులతో ఎస్పీ

పిడుగురాళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు సొంతూర్లకు ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ నుంచి ఎక్కువగా వస్తుంటారని, రాష్ట్ర రహదారిపై నిరంతరం నిఘా పెట్టి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించేలా పోలీసు శాఖ పర్యవేక్షించాలని ఎస్పీ కే. శ్రీనివాసరావు పోలీసులను ఆదేశించారు. శనివారం రాత్రి పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌లో మాచర్ల, గురజాల, కారంపూడి, దాచేపల్లి, పిడుగురాళ్ల సబ్ డివిజన్ డీఎస్పీ, ఎస్ఐ, సీఐలతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. రహదారి వెంట తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద రహదారి మార్జిన్‌లలో వాహనాలు నిలపకుండా చూడాలన్నారు. కోడిపందేలు స్థావరాలపై నిఘా ఉంచాలని, రద్దీగా ఉండే బస్టాండ్, రైల్వే స్టేషన్లలో మఫ్టీలో ప్రత్యేక సిబ్బందిని నియమించి దొంగతనాలు అరికట్టేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద రాష్ట్ర రహదారిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీతో పాటు గురజాల డీఎస్పీ జగదీష్ తో పాటు సబ్ డివిజన్ పోలీసులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వట్టెపు నాగేశ్వరరావు

ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి
ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

దాచేపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాలోని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ప్రజాసమస్యలపై పోరాటం చేసే వ్యక్తి అని, ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వట్టెపు నాగేశ్వరరావు అన్నారు. శనివారం నారాయణపురంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉపాధ్యాయ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై శాసన మండలిలో గళంవిప్పే లక్ష్మణరావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘ నేతలు షేక్ ఖాశింపీరా, సీపీఐ నాయకులు తెలనాకుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్ నుంచి వస్తున్న మంటలు

గ్యాస్ సిలిండర్ లీకై అగ్నిప్రమాదం

● గృహోపకరణాలు దగ్ధం

మాచర్లటౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఇంటిలో వంట గ్యాస్ సిలిండర్ లీకై అగ్నిప్రమాదం సంభవించిన ఘటన మాచర్ల పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పట్టణంలోని 16వ వార్డులో గల ఓ గృహంలో మండల రెవెన్యూ కార్యాలయ ఉద్యోగి ఖాశీం సైదా నివాసముంటున్నారు. అతని భార్య నిండు సిలిండర్‌ను ఓపెన్ చేసి స్టవ్‌ను వెలిగించింది. రెగ్యులేటర్ బిగించే ప్రాంతంలో గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఆందోళన చెందిన ఆమె బయటకు పరుగులు తీసింది. దీంతో మంటలు వ్యాపించి ఫ్రిజ్, టీవీతో పాటు పలు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటనా ప్రదేశానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఐవోసీ సిలిండర్‌లో వాషర్ సమస్య కారణంగా మంటలు వ్యాపించాయని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

వార్డుల్లో వసతుల కల్పనకు కృషి

● మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు
● పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటన

మాచర్లటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు తెలిపారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 1, 2, 16, 17, 29, 30 వార్డుల్లో ఆయన పర్యటించారు. వార్డుల్లో పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ దస్తగిరి, శ్రీనివాసరావు, నాగుల్‌మీరా, మున్సిపల్ డీఈ సుభాని తదితరులు ఉన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

బెల్లంకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెంకటాయపలెం గ్రామంలో ఏర్పాటుచేసిన విద్యుత్ బోరుని శనివారం టీడీపీ నేత, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ భూక్యా శ్రీను నాయక్, టీడీపీ నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ వెంకటాయపాలెం గ్రామంలో వేసవి కాలం వస్తే మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సుమారు కిలో మీటరు దూరంలో ఉన్న సింగర స్వామి ఆశ్రమం వద్దకు వెళ్ళి మంచి నీటిని తెచ్చుకుంటున్నారని, విద్యుత్ మోటారు బోరు ఏర్పాటుతో గ్రామస్తులకు నీటి కష్టాలు తీరినట్లేనన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేళం శ్రీరామమూర్తి, జనసేన పార్టీ నాయకుడు నూకల ఆంజనేయులు, మేళం యలమంద, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామానికి చెందిన బీటెక్ పేద విద్యార్థి బీ వెంకటేష్‌కి మాగులూరి ఫౌండేషన్ చైర్మన్ మాగులూరి భానుప్రకాష్ శనివారం ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు బోగినేని రోశయ్య, నాగేశ్వరావు, బండ్ల శ్రీను, ఎస్ శ్రీనివాస రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను శుభ్రం చేయాలి

సత్తెనపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వడ్డవల్లిలోవున్న హిందూ శ్మశాన వాటికలో పారిశుధ్య పనులు చేపట్టాలని పట్టణానికి చెందిన దాసరి రాజశేఖరరావు, రాఘవేంద్రరరావు, తిరుపతిరావు, పలువురు శనివారం ఒక ప్రకటనలో మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తిచేశారు. శ్మశాన వాటికలో పిచ్చి చెట్లు దట్టంగా ఉన్నాయని, నీటివసతి కూడాలేదని సంబందిత అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఓబన్న జీవితం యువతకు ఆదర్శం

● ఘనంగా జయంతి ఉత్సవాలు
● పాల్గొన్న కూటమి నేతలు, వడ్డెర సంఘీయులు

పిడుగురాళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తొలి తరం స్వాతంత్ర్య సమరయోధుడు, బ్రిటీష్ సైన్యాన్ని గడగడలాడించిన వడ్డె ఓబన్న జీవితం యువతకు ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. ఓబన్న జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంపై బీసీ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు.

పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో వడ్డెర సంఘ నేతలు తురకా వీరస్వామి, వేముల ఆంజనేయులు, దేవళ్ల రాంబాబులు వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నేతలు మల్లెల ఆదినారాయణ, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వడ్డవల్లి సాంబశివరావు, ఎల్‌వీఆర్, బత్తుల శ్రీను, జొన్నలగడ్డ శ్రీను, దూదేకుల ఖాశింసైదా, వల్లెపు రామకృష్ణ, పిచ్చారావు, చెన్నారావు, జెమిని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం, టీడీపీ నేతలు


మాచర్లలో ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యెనుముల కేశవరెడ్డి, తదితరులు

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్ సైన్యాన్ని పరుగులు పెట్టించిన యోధుడు వడ్డె ఓబన్న అని టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి కొనియాడారు. పట్టణంలోని కళామందిరం సెంటరులో ఓబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, వడ్డె ఓబన్న కమిటి అధ్యక్షుడు కొమెర అనంతరాములు, బత్తుల అనిల్‌కుమార్, మల్లెల గోపి పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపల్ కార్యాలయ ఆవరణలో వడ్డె ఓబన్న జయంతిని నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి మునిసిపల్ అధికారులు, వడ్డెర కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బత్తుల రామస్వామి, నెట్టెం సాంబశివరావు, గుంజి విజయ కుమార్, చల్లా శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, వర ప్రసాదరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో కూడా ఓబన్న జయంతిని నిర్వహించారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో వడ్డెర యువకులు సంపంగుల రాంబాబు, కొమర వెంకటరావు ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంతిని నిర్వహించారు. ముందుగా వారు ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజక వర్గ నాయకురాలు చల్లా అనూపకళ శివరాత్రి పెద శ్రీను, సాతర్ల చిన శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీసెల్ నాయకులు నల్లమేకల వెంకటేశ్వర్లు, బత్తుల కోటేశ్వరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి,(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి టీడీపీ కార్యాలయంలో కూటమి నేతలు ఓబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తంగెళ్ల శ్రీనివాసరావు, వేముల తిరుమలకుమార్, బాలయ్య, పుల్లయ్య, నారాయణ, భాస్కరరావు పాల్గొన్నారు.


సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఓబన్న జయంతి..

హెచ్‌ఎంపీవీకి కరోనా జాగ్రత్తలే..

ఫటాఫట్

డాక్టర్ ధనుష్,
పీహెచ్‌సీ వైద్యాధికారి, క్రోసూరు



క్రోసూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కరోనా సయంలో పాటించిన భౌతిక దూరం, మాస్క్ ధరించటం, చేతులు శుభ్రం చేసుకోవటం వంటి జాగ్రత్తలే ప్రస్తుతం విస్తరిస్తున్న హెచ్‌ఎంపీవీ వ్యాధికి పాటించాలని క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్ అన్నారు. ప్రస్తుతం చలికాలంలో ప్రజలు తీసుకోవాల్సిన, హెచ్‌ఎంపీవీకి పాటించాల్సిన జాగ్రత్తలు, పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవల గురించి పీహెచ్‌సీ వైద్యాధికారితో ఆంధ్రజ్యోతి ప్రతినిధి 'ఫటాఫట్ ..'

ప్రశ్న: హెచ్‌ఎంపీవీ వ్యాధి ఏ వయస్సు వారికి సోకే అవకాశం ఉంది?

జ : ఈ వ్యాధి శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటే చిన్న పిల్లలు, వృద్ధులకు సోకే అవకాశం ఉంది. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలి. రెండు రోజులకు మించి జ్వరం వచ్చినా, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనపడుతున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ప్రశ్న: చలి కాలంలో సీజనల్ వ్యాధుల కట్టడికి ఏం చర్యలు తీసుకుంటున్నారు.

జ : పిల్లలు, వృద్ధులను ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత సాధ్యమైనంత వరకు బయట తిరగకుండా చూడాలి. వ్యాధుల వ్యాప్తి నిరోధానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బందిని అప్రమత్తం చేశాం. గ్రామాల్లో తిరుగుతూ ఎక్కడైనా జ్వరాల కేసులు నమోదైతే గ్రామం మొత్తం సర్వే నిర్వహించటంతో పాటు రక్త నమూనాలు కూడా సేకరిస్తున్నాం.

ప్రశ్న : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత ఏమైనా ఉందా?

జ : ఆరోగ్య కేంద్రంలో ఎటువంటి మందుల కొరత లేదు. తమ వద్దకు వచ్చే అవుట్ పేషెంట్లందరికీ మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. రక్త పరీక్షలు నిర్వహించి తగిన విధంగా చికిత్స చేస్తున్నాం.

ప్రశ్న : కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నారా?

జ : ఆరోగ్య కేంద్రంలో శస్త్ర చికిత్సలు చేయటానికి డాక్టర్ల నియామకం జరగలేదు. త్వరలో మహిళా గైనకాలజిస్టును నియమిస్తామని అధికారులు తెలిపారు. కాన్పులు మాత్రం చేస్తున్నాం. కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ల కోసం వచ్చే వారిని సత్తెనపల్లి ఆస్పత్రికి పంపుతున్నాం.

ప్రశ్న : ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయా?

జ : అన్నిరకాల వ్యాక్సిన్‌లు ఉన్నాయి. కుక్క కాటు వ్యాక్సిన్‌లు, ర్యాబీస్ వ్యాక్సిన్‌లు, పసి పిల్లలకు వేసే వ్యాక్సిన్‌లు అన్ని సిద్ధంగా ఉన్నాయి.

ప్రశ్న : ఆస్పత్రిలో 24 గంటలు సేవలు అందజేస్తున్నారా?

జ : 24 గంటలు ఆస్పత్రిలో అప్రమత్తంగా ఉంటున్నాం. సిబ్బందిని కూడా అప్రమత్తం చేస్తున్నాం. డెలివరీల కోసం ఏ సమయంలో వచ్చినా తప్పనిసరిగా సహాయ పడుతున్నాం. ఆస్పత్రిలో తగినన్ని పడకలు కూడా సిద్ధంగా ఉన్నాయి.

పీహెచ్‌సీలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

క్రోసూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా చిన్న పిల్లలకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. హరిదాసుల చేత సంకీర్తనలు పాడించారు. భోగి మంటలు ఏర్పాటుచేశారు. ఆరోగ్య సిబ్బందికి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ధనుష్, డాక్టర్ మహమ్మద్ షాద్, డాక్టర్ సిరిచందన, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, సీనియర్ అసిస్టెంట్ జానీ బాషా, హెల్త్ సూపర్‌వైజర్ శివుడు, సీహెచ్‌వో సాంబశివరావు, ఏఎన్ఎం కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


పిల్లలకు భోగి పండ్లు పోస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలయాల వద్దకు సీసీ రోడ్లు ఏర్పాటు

బెల్లంకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండలో యాదవ బజారులో ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ, గంగమ్మ, పోలేరమ్మ, అంకమ్మ తల్లి ఆలయాల వద్దకు మహాత్మాగాంధీ ఉపాధి హామి పథకం నిధులతో సిమెంట్ రోడ్డును నిర్మించినట్టు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ జ్యోతి సముద్రం తెలిపారు. ఆలయాల వద్దకు రావాలంటే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు కొత్తపాలెం వెళ్ళే రహదారి నుంచి ఆలయాల వద్దకు నూతన సీసీ రోడ్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, ఉప సర్పంచ్ కొండవీటి రజాక్, వార్డు మెంబర్లు, అధికారుల పర్యవేక్షణలో సీసీ రోడ్డు నిర్మాణం జరిగింది.

జేఆర్ఆర్ నవోదయా డిగ్రీ కళాశాలలో
సంక్రాంతి సంబరాలు

గురజాలటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేఆర్ఆర్ నవోదయా డిగ్రీ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. భోగి మంటలు వేసి విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ దేరం వెంకటేశ్వరరెడ్డి, దాసిరెడ్డి పుల్లారెడ్డి, డైరెక్టర్లు కోటిరెడ్డి, గంటా కిషోర్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలు వేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న పరాశక్తి సిమెంట్ ఉద్యోగులు, కార్మికులు

భద్రతను బాధ్యతగా తీసుకుందాం

● పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు

రెంటచింతల,జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : భద్రతలను ఓ బాధ్యతగా తీసుకుందామని, అప్పుడు మనతో పాటు మన కుటుంబీకులు ఆనందగా ఉంటారని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఫ్యాక్టరీ ఆవరణలో అనంతరం కార్మికులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేశారు. ముందుగా తొలుత భద్రతా జెండాను రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన భద్రతా పరికరాల వినియోగం, జాగ్రత్తలపై కార్మికులకు, సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో జీఎంలు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, డీజీఎం జీ.మల్లికార్జున, కీసర వెణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత



కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి



రాజధానిలో కంకర దొంగలు

- కృష్ణాయపాలెం- శాఖమూరు రోడ్డును తవ్వేసిన దుండగులు
- గత వైసీపీ హయాంలోనూ యథేచ్ఛగా నెక్కల్లు వద్ద దోపిడీ



రోడ్డును తవ్వుకుపోగా ఏర్పడిన లోతైన గుంతలు

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మళ్లీ కంకర దొంగలు చెలరేగిపోయారు. రెండు రోజుల క్రితం మంగళగిరి మండలం కృష్ణాయపాలెం- శాఖమూరు మీదగా అనంతవరం వెళ్లే రోడ్డును తవ్వేశారు. ఎక్స్‌కవేటర్‌తో తవ్వి లారీల్లో కంకర, మట్టిని తరలించుకుపోయారు. దాదాపు 200 మీటర్ల మేర 3 అడుగుల లోతులో రోడ్డును తవ్వారు. 25, 30 టిప్పర్లతో మట్టి, కంకర తరలించుకుపోయారు. పశువుల కాపరులు గమనించి ఈ విషయాన్ని రైతులకు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గతంలోలా మట్టి, కంకర దొంగతనం జరగడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, సీఆర్డీఏ అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగానే దోపిడీలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మంత్రి లోకేశ్ నియోజకవర్గంలో ఇలా దోపిడీ జరగడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

● గత వైసీపీ హయాంలో మట్టి, కంకర, ఇసుక దొంగలు యథేచ్ఛగా చెలరేగి పోయారు. రాజధానిలో రోడ్లన్నింటినీ తవ్వుకుపోయారు. అప్పటి అధికార పార్టీ అండతో అక్రమార్కులు అడ్డుఅదుపు లేకుండా చెలరేగిపోయారు. రాజధాని నిర్మాణం కోసం తెచ్చిన ఇనుము, ఇసుకను కాజేసిన దొంగలు రోడ్లను తవ్వుకుని కంకర, గులక ఇసుకను తవ్వుకుపోయారు. 2022లో సాక్షాత్తు రాష్ట్ర అసెంబ్లీకి కూతవేటు దూరంలో రోడ్డును తవ్వి గులకరాయి తవ్వుకుపోయిన ఘటన గతంలో సంచలనంగా మారింది. రాజధాని రైతులు, మహిళలు అడ్డుకున్నా అక్రమాలను ఆగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక ఎలాంటి ఇబ్బంది ఉండదులే అనుకుంటున్న సమయంలో మళ్లీ కంకర దొంగల దోపిడీ రాజధానివాసులను ఉలిక్కి పడేలా చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్రమార్కులు ఇలా చెలరేగిపోవడానికి అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యమే కారణమని రైతులు భావిస్తున్నారు.

నేటి నుంచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

- ముప్పాళ్లలో రైతుమిత్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ

ఈపూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రైతుమిత్ర కబడ్డీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 17వ తేదీ వరకు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు తల్లపనేని రామారావు తెలిపారు. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో డే అండ్ నైట్ పోటీలు జరుగుతాయన్నారు. సీఎం చంద్రబాబును కూడా పోటీలకు ఆహ్వానించినట్లు తెలిపారు. 33 ఏళ్లుగా రాజకీయ, కుల, మతాలకు అతీతంగా పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల నిర్వహణలో గ్రామంలో ప్రతి ఒక్కరు తమకు చేతనైన సాయంచేస్తున్నారన్నారు. ఈ ఏడాది విజేతలకు రూ.9లక్షల వరకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 50 జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.



పోటీలకు ముస్తాబు గ్రౌండ్

ప్రకృతి వ్యవసాయంతోనే మనుగడ సాధ్యం

- తెలంగాణ జీఎస్టీ జాయింట్ కమిషనర్ శ్రీలీల

తెనాలి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేసే ప్రతి ఒక్కరూ ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని ఆపేసి పూర్వీకులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులేస్తే రాబోయే రోజుల్లో రైతుల మనుగడ సాధ్యమవుతుందని తెలంగాణ జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎడ్ల శ్రీలీల తెలిపారు. మండలంలోని కొలకలూరులో శ్రీభారత్ ఫౌండేషన్, సేవ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై సస్యశ్యామలామ్ అనే కార్యక్రమం ద్వారా రైతులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా ఆత్మహత్యలు చేసుకునే వారిలో రైతులే ఉండటం బాధాకరమన్నారు. ఎరువులు, పురుగుమందులు అధికంగా వాడటం వల్ల దిగుబడి వచ్చినా వాటికి అయిన ఖర్చుకు సరిపోకపోవడంతో రైతులు అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. గతంలో మన పూర్వీకులు వ్యవసాయంతోనే కుటుంబాల్లోని పిల్లలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దుకోగలిగారని అప్పట్లో ఆత్మహత్యలు లేవన్నారు. సుభాష్‌పాలేకర్ కృషి(ఎస్‌పీకే) విజయరామ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. గోవులు, గేదెలు, వేప, ఇతర చెట్లతో సంప్రదాయ వ్యవసాయాన్ని చేసి అధిక లాభాలు గడించవచ్చన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న తెలంగాణ జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎడ్ల శ్రీలీల

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మేడికొండూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పేరేచర్ల సమీపంలో శనివారం రాత్రి 11గంటల సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లి వైపు నుంచి గుంటూరు వైపు బైక్‌పై వెళుతున్న ఏలూరు జిల్లా కలిదిండి గ్రామానికి చెందిన మేక భాగ్యరమేష్(30)ను వెనుక వైపు నుంచి వాహనం ఢీకొట్టడంతో కిందపడి అక్కడికక్కడే మరణించాడు. ఢీకొన్ని వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మేడికొండూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రత్తయ్యచౌదరి మెమోరియల్ ప్రాంగణంలో రెండో రోజైన శనివారం ఆరు పళ్ల విభాగంలో నిర్వహించిన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 11 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వేటపాలేనికి చెందిన శిరీషచౌదరి ఎడ్ల జత 4800 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని సాధించాయి. గుంటూరు జిల్లా మేడికొండూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి ఎడ్లు, పెదపరిమికి చెందిన శ్రీలక్ష్మి ఎడ్లు 4500 దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. బి.సుశ్మిత చౌదరి ఆకులపాడు (గుంటూరు)కు చెందిన ఎడ్లు 3,626 దూరం లాగి తృతియస్థానం, ఎన్.వెంకటరావు కొల్లవారిపాలెం(బాపట్ల) 3557 దూరంలాగి నాల్గో స్థానం, ఎం.అంజిరెడ్డి చెల్లగుండ (పల్నాడు జిల్లా) 3427 దూరం లాగి ఐదో స్థానం, వై.హుస్సేన్ ఎర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)కు చెందిన ఎడ్లు 3389 అడుగుల దూరం లాగి ఆరోస్థానంలో నిలిచాయి.

ఫొటో తీసుకునే ప్రయత్నం.. కాల్వలో గల్లంతు

- సంక్రాంతి సెలవులకు వచ్చిన ఎంబీఏ విద్యార్థి విషాదాంతం

మాచర్లటౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఫొటో తీసుకుందామని వెళ్లి కుడికాల్వలో ఓ విద్యార్థి గల్లంతైన సంఘటన మాచర్లలో జరిగింది. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఆరే శ్రీనివాసరావు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి కుమారుడు, కుమార్తె సంతానం. కాగా కుమారుడైన అమరలింగేశ్వరరావు (21) విజయవాడలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన అమరలింగేశ్వరరావు ఈ నెల 8న స్నేహితులతో కలిసి ఫొటోలు, వీడియోలు చేసేందుకు పట్టణంలోని బొంబాయి కంపెనీ కుడికాల్వ బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. స్నేహితుడు వీడియో తీస్తుండగా కుడి కాల్వ బ్రిడ్జిపై నుంచి దూకాడు. నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు కాల్వ వెంబడి గాలించినా ఇప్పటివరకు అమరలింగేశ్వరరావు ఆచూకీ తెలియలేదు. దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.



కాల్వలో దూకుతున్నట్లు ఫొటో తీసుకునే ప్రయత్నంలో అమరలింగేశ్వరరావు

ఎమ్మెల్యే ఫ్లెక్సీని చింపిన వైసీపీ మూకలు

- రూరల్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు

బాపట్ల రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎమ్మెల్యే ఫ్లెక్సీని వైసీపీ మూకలు చించిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ వైయస్సార్ నగర్ గ్రామంలో శనివారం సీసీ రోడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా వైసీపీకి చెందిన రామలింగం పోలిరెడ్డి విద్యుత్ లైట్లను ఆపివేసి ఎమ్మెల్యే ఫ్లెక్సీని బ్లేడుతో చింపివేశాడు. ఎందుకు ఫ్లెక్సీలు చింపావని అదే గ్రామానికి చెందిన సమీట మల్లికార్జున్ రెడ్డి అడగగా తనను ఆసోది శ్రీనివాస్‌రెడ్డి, ఆసోది శివారెడ్డి, మరుప్రోలు ఇస్సాక్‌రెడ్డి పంపించారు, నువ్వు ఎవరు అడగడానికి అని తిడుతూ మల్లికార్జున్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు మల్లికార్జున్‌రెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు రామలింగం పోలిరెడ్డి, ఆసోది శ్రీనివాసరెడ్డి, ఆసోది శివారెడ్డి, మరుప్రోలు ఇస్సాక్ రెడ్డిపై బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాటక వారం.. చంద్రన్న వరం.. గొప్ప అవకాశం

- ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ
- రెండో రోజుకు గుంటూరు కళాపరిషత్ నాటక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), జనవరి 11(ఆంధ్రజ్యోతి): వారం.. వారం.. నాటక వారం శనివారం.. చంద్రన్న వరం పేరుతో కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారని, ఇది సంస్థలు, కళాకారులకు గొప్ప అవకాశమని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటక ప్రదర్శనలు రెండో రోజుకు చేరుకున్నాయి. ప్రదర్శనలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నాటక ప్రదర్శనలకు టీటీడీ వారిచే పారితోషికం ఇప్పించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కళా పరిషత్ ఉపాధ్యక్షుడు నాయుడు గోపి మాట్లాడుతూ నాటక ప్రదర్శనలకు దాతల సహకారం మరువలేనిదన్నారు. నాటక రంగానికి గుమ్మడి గోపాలకృష్ణ చేస్తున్న సేవలను గుర్తించి రెండో సారి నాటక అకాడమీ చైర్మన్ పదవి వచ్చిందన్నారు. సభలో ఆడిటర్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, కళా పరిషత్ సభ్యులు పోపూరి శివరామకృష్ణ, ఆవుల సుబ్బారావు ప్రసంగించారు. గుమ్మడి గోపాలకృష్ణను కళాపరిషత్ సభ్యులు గుమ్మడి నాగేశ్వరరావు, అలోకం పెద్దబ్బయ్య, పూర్ణ, మల్లికార్జునరావు సత్కరించారు. అనంతరం గంగోత్రి, పెదకాకాని వారిచే నాయుడు గోపి దర్శకత్వం వహించిన అష్టమ వసువు సాంఘిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు.



గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న గుంటూరు కళాపరిషత్ సభ్యులు



అష్టమవసువు నాటికలో ఓ సన్నివేశం

15న రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీలు

ఈపూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని నందమూరి తారక రామారావు మెమోరియల్, శివశక్తి లీలా అండ్ అంజన్ పౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 15వ తేదీన రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు శనివారం నిర్వాహకులు రాపర్ల జగ్గారావు తెలిపారు. చుక్కలు, గీతల ముగ్గులకు బహుమతులు అంద జేస్తామన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం : ఈఈ



33 కేవీ విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో ఈఈ సీహెచ్ రాంబొట్లు

ఈపూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించేందుకు విద్యుత్‌శాఖ కృషి చేస్తుందని ఈఈ సీహెచ్ రాంబొట్లు అన్నారు. వినుకొండ 132 కేవీ లైన్ నుంచి ఈపూరు మండలంలోని కొచ్చెర్ల, ఊడిజర్ల 33 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.1.30కోట్లతో కొత్త లైను వేశారు. శనివారం 33కేవీ లైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ కొత్త లైన్ ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయ ఉండదన్నారు. లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో ఈడీఈ సుబ్బారెడ్డి, ఏడీ ఈ శ్రీనివాసరావు, నర్సరావుపేట రూరల్ ఏడీఈ బీ వెంకటేశ్వరరెడ్డి, ఏఈ గాంధీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుడారై ఉత్సవం



కుడారై ఉత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

వినుకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో సన్నిది వెంకట నాసరమ్మ ధ్యాన మందిరంలో శంకర్ సత్సంగం ఆధ్వర్యంలో ధనుర్మాస పూజా కార్యక్రమాల్లో భాగంగా భక్తులు 26 రోజుల నుంచి అత్యంత వైభవంగా పూజలు నిర్వహిస్తు 27వ రోజు శనివారం కుడారై ఉత్సవాలు శనవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్యానమందిరం దాతలు అమెరికాలో నివాసం ఉంటున్న సన్నిది వెంకటరాజేంద్ర ప్రసాద్, మల్లీశ్వరి, సన్నిది వెంకట రామకృష్ణ లలితలు స్వగ్రామం విచ్చేసిన సందర్భంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులు చేస్తున్న సేవలను గురించి వారు కొనియాడారు. 35సంవత్సరాలుగా సత్సంగంలో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ధాన్యం కొనుగోళ్లను పునరుద్ధరించాలి

● రైతాంగ పోరాట కమిటీ నేత హనుమంతరావు

శావల్యాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రొక్యూర్‌మెంట్ సమస్యతో నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర రైతాంగ పోరాట కమిటీ నేత, టీడీపీ రాష్ట్ర మాజీ పరిశీలకుడు ముంద్రు హనుమంతరావు కోరారు. శావల్యాపురంలో శనివారం ఆయన మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ళు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని, జిల్లాకు కేటాయించిన ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయిందని స్థానిక వ్యవసాయశాఖాధికారులు కుంటిసాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేసి రైతులను ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. దీనిపై అచ్చెన్నాయుడు స్పందించి రైతుల వద్ద నున్న ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వ మద్దతుధరకు కొనుగోలు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారని తెలిపారు.

సాతులూరులో సంక్రాంతి సంబరాలు

నాదెండ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాతులూరు గ్రామంలో 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు కాకతీయ ఉత్సవ కమిటీ వారు తెలిపారు. హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు సహకారంతో సంయుక్తంగా వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు వారు వివరించారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక పోటీలు

యడ్లపాడు, జనవరి 11 (ఆంధ్రజోతి) : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవై ఎఫ్ఐ) ఆధ్వర్యంలో 45వ సంక్రాంతి సాంస్కృతిక, క్రీడోత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు లింగారావుపాలెం డీవైఎఫ్ఐ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ 44 ఏళ్ళుగా క్రమం తప్పకుండా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ తదితర క్రీడా పోటీలతోపాటు క్విజ్, వ్యాసరచన, కథలు చెప్పడం వంటి పోటీలు నిర్వహిస్తారన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మోకు లాగుట, మ్యూజికల్ చైర్స్ పన్నీ గేమ్స్ తదితర పోటీలు నిర్వహిస్తారన్నారు. వీటితోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మేళ్ళవాగులో లోపించిన పారిశుధ్యం

● పూడిపోయిన మురుగు కాలువలు
● సిమెంట్ రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు
● ప్రయాణానికి ఇబ్బంది పడుతున్న ప్రజలు



మేళ్ళవాగులో సిమెంట్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

బొల్లాపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళ్లవాగు గ్రామంలోని మురుగు కాలువలు పూడిపోవటంతో గ్రామంలోని మురుగునీరు ప్రధాన రహదారి సిమెంట్ రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ రోగాల భారిన పడుతున్నారు. వాహనదారులు ఈ మురుగునీటిలో ప్రయాణించాల్సి వస్తుంది. ముఖ్యంగా సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ఉన్నా మురుగు కాలువలు పూడి పోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ కాలువల్లో పూడికను పంచాయతీ వారు తొలగించక పోవటంతో కాలువలు పూడిపోయి ఈ మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి ప్రవహిస్తుంది. సిమెంట్ రోడ్డు వేసినా కూడా ఉపయోగం లేకుండా గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పలు మార్లు పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింద న్నారు. గ్రామంలో ఈ దుస్థితిని గ్రామ పంచాయతీ అధికారులు చూస్తూ కూడా దీనిపై స్పందించటం లేదు. సంక్రాంతి పర్వది నాన కూడా ఈ మురుగునీటితో ఇబ్బందుల పడాల్సి వస్తుందని గ్రామస్థులు, ఆ రహదారిన వెళ్లిన పలువురు వాహనదారులు, వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి మురుగు కాలువల్లో పూడికను తొలగించి మురుగు నీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతుల సంతోషంతోనే దేశాభివృద్ధి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు
● ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన మినీగోకులం షెడ్ల ప్రారంభం



తిమ్మాపురంలో మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రైతు సంతోషంగా ఉంటేనే దేశం బాగుంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.2.30లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల తొలి పండుగ సంక్రాంతి అని, అటువంటి పండుగ వేళ అన్నదాతల లోగిళ్ల కళకళలాడాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చే విధంగా ప్రవేశపెట్టిన గోకులం పథకాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని, అప్పుడే ప్రభుత్వ ఆలోచనలు సఫలీకృతమవుతాయన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, సీనియర్ టీడీపీ నాయకులు పావులూరి శ్రీనివాసరావు, ఎంపీడీవో హేమలతాదేవి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, తెలుగు దేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

మరో మూడు గ్రామాల్లో

మండలంలోని వంకాయలపాడు, సొలస, కొత్తపాలెంలలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను శనివారం ప్రారంభించారు. ఆయా కార్య క్రమాల్లో ఎంపీడీవో హేమలతాదేవి, ఏపీడీ హీరాలాల్, టీపీ మాధవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల, జనవరి 11(ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల, ఆరేపల్లి గ్రామాల్లో మినీ గోకులాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సుమారు రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన మినీ గోకులాలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో మినీ గోకులాలను, కోళ్ల ఫారాలకు, గొర్రెలు, పందుల ఫారాలకు ప్రోత్సాహకాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

గోకులం షెడ్లతో పాడిపరిశ్రమకు ప్రోత్సాహం

● ఉపాధిహామీ పథకం ఏపీవో రామారావు

శావల్యాపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు తగిన ప్రోత్సాహకాన్ని అందించి మరుగున పడుతున్న పాడిపరిశ్రమను తిరిగి గాడిలో పెట్టేందుకే ప్రభుత్వం గోకులం షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని ఏపీవో కటారపు రామారావు అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకం నిధులతో మండలంలోని బొందిలిపాలెం, చిన్నకంచెర్ల, కారుమంచి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గోకులంషెడ్లను అధికారులు, టీడీపీ నాయకులు శనివారం ఘనంగా ప్రారంభించారు. బొందిలిపాలెంలో షెడ్డును ఏపీవో రామారావు ప్రారంభించారు. ఏపీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలకు మొత్తం 25 గోకులం షెడ్లు మంజూరవ్వగా వాటిలో 13షెడ్లు పూర్తయ్యాయని, 9 నిర్మాణదశలో ఉన్నాయని, 3ప్రారంభించాల్సి ఉందన్నారు. ఒక్కో షెడ్డుకు ప్రభుత్వం 2.30లక్షలు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు పొనుగోటి వెంకట్రావు, మాజీ సర్పంచ్ ముంద్రు వెంకటేశ్వర్లు, సోమేపల్లి ఆదెయ్య, పాపసాని పెదనారయ్య, పసుమర్తి బసవయ్య, దూళిపాళ్ళ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నపోరాట పటిమను స్మరించుకోవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : భారత స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న బ్రిటీష్ వారిని ఎదిరించి పోరాడిన పటిమను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించటం సంతోషదాయకం అన్నారు. కులం కన్నా గుణం గొప్పదని, మతం కన్నా మానవత్వం గొప్పదన్నారు. వడ్డే ఓబన్న మనందరి వాడని, ఆయన బ్రిటిష్ వారిపై పోరాడుతూ చేసిన ప్రాణ త్యాగాన్ని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని అన్నారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే వేణుగోపాలరావు, వడ్డెర సంఘం నాయకులు వల్లెపు నాగేశ్వరరావు, దేవల వెంకటేశ్వర్లు, కుంచాల వెంకటరావు, వేముల పాండు, బత్తుల వెంకటేష్, కుంచాల కోటేశ్వరరావు, వల్లెపు లక్ష్మయ్య, దేవల స్వామి, చలం మాస్టార్, బీఎస్ఎన్ఎల్ శ్రీను పాల్గొన్నారు.



ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

స్వాతంత్ర్య పోరాటంలో ఓబన్న కృషి ఎనలేనిది

● మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ వారిని తరిమివేయడంలో అసువులు బాసిన వడ్డె ఓబన్న విశిష్ట వ్యక్తిత్వం గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అన్నారు. ఓబన్న జయంతిని పురస్కరించుకొని నరసరావుపేట రోడ్డులో రిలయన్స్ పెట్రోల్‌బంక్ వద్ద ఉన్న ఓబన్న విగ్రహానికి సంఘం నాయకులు పల్లపు వెంకటేశ్వర్లుతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలను సంఘటితంగా ఎదుర్కొని బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొందాలని తెల్లదొరలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపడుతున్న నేపథ్యంలో 35 సంవత్సరాల పిన్నవయస్సులో బ్రిటీష్ సైన్యం ఆయనను తుదముట్టించిదని, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయిధపోరులో సైన్యాధ్యక్షుడిగా ఓబన్న పోషించిన వీరోచిత పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో సౌదాగర్ జానిబాషా, వినుకొండ నియోజకవర్గ వడ్డె ఓబన్న విగ్రహ కమిటీ సభ్యులు బత్తుల నరసింహరావు, బత్తుల బాలరాజు, దేవల ప్రసాద్, పల్లపు పున్నయ్య, బత్తుల వెంకటరావులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

● **చిలకలూరిపేట(ఆంధ్రజ్యోతి)** : మున్సిపల్ కార్యాలయంలో శనివారం వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి మున్సిపల్ డీఈఈ అబ్దుల్ రహీం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ ఖాదర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఈఈ అబ్దుల్ రహీం మాట్లాడుతూ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న అని అన్నారు.

● **నూజెండ్ల (ఆంధ్రజ్యోతి)**: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వడ్డె ఓబన్న చిత్రపటానికి జడ్పీటీసీ జె సుబ్బులు రాములు, ఎంపీపీ పీ ఉమాదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పార్థసారథి, జూనియర్ అసిస్టెంట్ భావన, పంచాయతీ కార్యదర్శులు నాగూర్, లాలు, స్వచ్ఛ భారత మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



సీఆర్ కళాశాలలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు



వినుకొండలోని వివేకనంద బీఈడీ కళాశాల ఆవరణలో వేసిన భోగిమంటల చుట్టూ సందడి చేస్తున్న విద్యార్థులు

నాదెండ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో సీఆర్ డిగ్రీ కళాశాల, నాదెండ్లలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి హరిదాసుల కీర్తనలతో సంప్రదాయాన్ని చాటుకున్నారు. కోరమాండల్ వారి సౌజన్యంతో కేఎస్‌ఆర్ స్కూల్ వారి సహకారంతో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుతులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చైతన్య, కోరమాండల్ సంస్థ జోనల్ మేనేజర్ ఎస్ హరి పాల్గొన్నారు.

● **నరసరావుపేట టౌన్(ఆంధ్రజ్యోతి)** : స్థానిక పీఎన్‌సీ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన భోగిమంటలు, కోలాటాలు, గాలిపటాలు ఎగరవేయటం ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జాయింట్ సెక్రటరీ శ్రీనివాసప్రసాదు బహుమతులు పంపిణీ చేశారు.

● **నూజెండ్ల (ఆంధ్రజ్యోతి)**: మండలంలోని మారెళ్ళవారిపాలెం, కొత్తజెడ్డావారిపాలెం గ్రామాల్లో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో వాలీబాల్ పోటీలను ప్రారంభించనున్నారు. అదేవిధంగా గ్రామాల్లో ముగ్గుల పోటీలు, ఇతర సంప్రదాయ ఆటల పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఇతర ప్రదేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న, చదువుకుంటున్న యువతీ యువకులు, బంధు మిత్రులతో గ్రామాల్లో సందడి నెలకుంది.

వినుకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వివేకనంద బీఈడీ కళాశాల ఆవరణలో వివేకానంద హైస్కూల్ విద్యార్థులు సంక్రాంతి పండుగ సందర్భంగా సంక్రాంతి సంబరాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. చిన్నారులకు ముగ్గుల పోటీలతోపాటు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బోగిమంటలతో గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి బతుకమ్మ విద్యార్థులతో ఆడించారు.

బిక్కిరాముల స్థూపంపై అమరవీరుల చిత్రపటాల ఆవిష్కరణ

● ఉపా కేసులు ఎత్తివేయాలి రాష్ట్ర బంధుమిత్రుల అధ్యక్షురాలు అంజమ్మ



స్థూపంపై అమరవీరుల చిత్రపటాలను ఆవిష్కరించిన బంధుమిత్రుల సంఘం, వామపక్షపార్టీల నాయకులు

వినుకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఇటీవల పునర్నిర్మించిన బిక్కిరాముల స్థూపంపై తెలంగాణ, శ్రీకాకులం సాయుధ పోరాటంలో అమరులైన బిక్కిరాములు, ఖాజామియా, కమతం బాలవజ్రం, పమ్మియోగి సుబ్బారెడ్డిల చిత్రపటాలను బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బొప్పూడి అంజమ్మ, శోభ, భవాని ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించి అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సీపీఎం నాయకులు హనుమంతరెడ్డి, ప్రముఖ న్యాయవాది లూకా, విద్యావంతుల వేదిక నుంచి సీహెచ్ఎల్ఎన్ మూర్తి, జాషువా సమాఖ్య నాయకులు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, పీడీఎం వెంకటేశ్వరరావు, పీకెస్ పోతురాజు తదితరులు పాల్గొని దేశం కోసం సోషలిస్టు సాధనకోసం తమ విలువైన ప్రాణాల ను తృణప్రాయంగా అర్పించిన గొప్ప పోరాటయోధులని కొనియాడారు. వీరి స్ఫూర్తిని కొనసాగించడం అంటే దోపిడీ, పీడన అణచితవేతలు లేని ఉన్నతమైన సమాజం, సోషలిజాన్ని సాధించడమే మన కర్తవ్యమని తెలిపారు. దండకారణ్యంలో రక్తసిక్తం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దమనకాండలను ఈ సందర్భంగా ఖండించాలని, ఊపా కేసులను ఎత్తివేయాలని, ఎన్ఐఏ రద్దు చేయాలని, హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

చార్లెస్ స్కూల్ 58వ వార్షికోత్సవం

చిలకలూరిపేట, జనవరి11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చార్లెస్ స్కూల్ 58 వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ చార్లెస్ స్కూల్లో చదువుకున్న ఎంతో మంది పేద, మధ్య తరగతి వారు ఉన్నతమైన స్థానాల్లో ఉండడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు.

● **ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు**

స్థానిక ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఒమేగా హాస్పిటల్ వారి సహకారంతో పట్టణంలోని కేజే హాస్పిటల్ ఆవరణలో స్త్రీలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ, డాక్టర్ ముద్దన రమేష్ బాబు, డాక్టర్ గితారుక్మిణి సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో రూ.6700 కోట్లు పెండింగ్ బిల్లులు విడుదల

● హర్షం వ్యక్తం చేసిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబు లబ్ధిదారులకు పెండింగ్ బకాయిలను ఒకేసారి రూ.6700 కోట్లు విడుదల చేయడంపై ప్రభుత్వం చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బిన్న వర్గాల క్షేమంపై చంద్రబాబు నాయుడుకు ఉన్న ప్రేమానురాగాలకు ఇదే నిదర్శనమని తెలిపారు. గత వైకాపా హయాంలో రూ.లక్ష కోట్లు పెండింగ్ బిల్లు పెట్టి పోయారని, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ, రాష్ట్ర ప్రజల సంక్షేమంతో పాటు, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని చెప్పారు. వేల కోట్లు నిధులు విడుదలతో సంక్రాంతికి అసలైన సంబరాలకు అవకాశం కల్పించారన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, చిరు వ్యాపారుల కళ్లల్లో ఆనందం నింపినందుకు తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. విద్యార్థులకు రూ.3 వేల కోట్లకు పైగా ఫీజులు ఎగ్గొట్టి పోయిన జగన్‌రెడ్డి, ఆ ఫీజుల పేరుతో రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తుంటే. మంత్రి నారాలోకేశ్ విజ్ఞప్తి మేరకు ఆరున్నర లక్షల మంది విద్యార్థులకు మేలు చేసే రూ.788 కోట్లు విడుదలకు ఆమోదం తెలపడంపై విద్యార్థులు గమనించాలన్నారు. రాష్ట్రంలో చిన్న, చిన్న కాంట్రాక్టర్లకు రూ.10 లక్షలోపు పెండింగ్‌లో ఉన్న 26 వేల మందికి బిల్లులు చెల్లించాలన్న నిర్ణయం సీఎం చంద్రబాబునాయుడు మంచి మనసును తెలియచేస్తుందని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరంలో ప్రీమియల్ లీగ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారుల గురించి మాట్లాడుతూ క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో కూడా ప్రభుత్వం రిజర్వేషన్ కల్పిస్తుందన్నారు. గ్రామంలో జరిగే క్రికెట్ మ్యాచ్‌లలో ఎవరైనా ఉత్తమ ప్రతిభ కనబరిస్తే వారి పేరును రాష్ట్ర స్థాయికి సిఫార్స్ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వై వెంకటరామిరెడ్డి, సిద్ధారెడ్డి, వీరారెడ్డి, షేక్ పఠాన్ అబ్దుల్, ఆర్ఎంపీ జే బొల్లయ్య, నిర్వాహకులు టీ అనీల్, జీ వెంకి, కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు రాజేశ్వరి



ఎం రాజేశ్వరి

ఈపూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థిని సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయం క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు శనివారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సాధన డిగ్రీ కాలేజీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల క్రికెట్ అంతర కళాశాలల పోటీల్లో ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థిని ఎం రాజేశ్వరి పాల్గొని ఏఎన్‌యూ మహిళా జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జనవరి ఆఖరి వారంలో మైసూర్ విశ్వవిద్యాలయంలో జరిగే దక్షణ మండల విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిత్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్ బలరాం నాయక్, సీహెచ్ అరవింద్, ఎం దాసు, కే వంశీ, అభినందించారు.

ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.2.5 లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సపాలెంలో ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నరసరావుపేట వాస్తవ్యులు రవి స్వీట్స్ అధినేత సత్యనారాయణ, ధనలక్ష్మీ దంపతులు రూ.2.5 లక్షల చెక్కును ఆలయ కార్య నిర్వహణ అధికారి మాధవీదేవికి అందజేశారు. అనంతరం ఆలయంలో మహం కాళి అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు పాల్గొ న్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను ఆలయ అర్చకులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి మాధవీదేవి దాతలకు అందజేశారు.

కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



కాపు ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేసిన కాట్వా సంఘం నాయకులు

వినుకొండటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినుకొండ వారి ఆధ్వర్యంలో రెండోసారి నియోజకవర్గంలోని ప్రతిభ గల కాపు విద్యార్థులకు శనివారం స్కాలర్‌షిపులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాట్వ వ్యవస్థాపకుడు కొల్లా నారాయణ, వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి ఫణీంద్ర, కాట్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకీధరరావు, వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు చెన్నకేశవులు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు రామశెట్టి గోవిందరాజులు, కాట్వ కార్యదర్శి ఏడుకొండలు, వినుకొండ కాట్వా అధ్యక్షులు ఆర్‌జే రమేష్, కాట్వా కార్యదర్శి గణప వీరాంజనేయుల చేతులమీదుగా పదో తరగతి, ఇంటర్, నీట్, ఐఐటీ, సీట్లు సాధించిన 100మంది విద్యార్థులకు రూ.5వేల చొప్పున నగదుతోపాటు ప్రశంసాపత్రంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు రూ.1.50లక్షలు ఆర్థిక సాయం అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాదినేని ఆంజనేయులు, నాగమల్లేశ్వరరావు, నరసింహరావు, ప్రముఖ వ్యాపారవేత్త లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ నాయకులు కొణిజేటి నాగశ్రీనురాయల్, శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని పీహెచ్‌సీ వైద్యులు

● టీడీపీ మండల అధ్యక్షుడు గోవిందునాయక్

బొల్లాపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించటం లేదని టీడీపీ మండల అధ్యక్షుడు గోవిందునాయక్ శనివారం తెలిపారు. ఉదయం 12గంటలు అవుతున్నా వైద్యాధికారులు, సిబ్బంది ఎవ్వరూ ఆరోగ్య కేంద్రానికి రాకపోవటంతో రోగులు వెనుదిరిగి వెళ్తున్నారని ఆయన తెలిపారు. రక్త పరీక్షా కేంద్రానికి తాళం వేసిన ఉండటాన్ని గోవిందునాయక్ విలేకరులకు చూపించారు. ఉన్నతాధికారులు స్పందించి సదరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.